


గుహలా ఉందా చీకటి గది... గాలి బిగదీసుకున్నట్లుంది... అప్పడప్పుడు గబ్బిళాల. గబ్బు గుప్పు మంటోంది. ఎక్కడో కీచురాళ్ళ చప్పుడు.

గరుకు నేలమీద మోచేతుల్లో తల దాచుకుని కూర్చున్న ఆ స్త్రీ ఆవులించింది. ఎప్పుడు రెండు ఇడ్డెనలు ఎంగిలి పడిందో ఏమో— ఇప్పుడు కడుపులో సింహాలు గర్జిస్తున్నాయి. దాహంగానూ ఉంది.

కిర్రుమని ఓరగా తెరుచుకున్న తలుపుల మధ్య ఎలుగుబంటి లాంటి ఓ కానిస్టేబుల్ నల్లని ముఖం "ఏయ్!" లాఠీకర్రతో బలంగా తలుపుమీద కొట్టాడతను. "హెడ్డు గారొచ్చే టయిమయింది లేవే!" బీడీ వాసన గుప్పుమంది.

బయట సైకిల్ బెల్ చప్పుడు. కాస్సేపటికి హెడ్ కానిస్టేబుల్‌ను వెంటబెట్టుకొచ్చాడా కానిస్టేబుల్.

చిహాలున వెళ్లి ఓ తుప్పపట్టిన పాత స్టీలు కుర్చీని తెచ్చాడు కానిస్టేబుల్. దానిమీద అభిముఖంగా కూర్చున్నాడు హెడ్డు. "ఏమిటే పేరు?"

"సావిత్రి" ఎక్కడో బావిలోంచి వెలువడుతున్నట్లొంది ఆమె స్వరం.

"అబ్బో! పతివ్రత పేరే" అంటూ కానిస్టేబుల్ వంక తిరిగి, "రానుకో" అన్నాడు హెడ్డు. మళ్ళీ ఆ యువతి వంక తిరిగి, "ఎంతకాలంగా ఈ బిజినెస్?" అడిగాడు.

అర్థం కానట్లు నొసలు చిట్లించిందామె

"తూత్తెరీకె... అలా చూస్తావేంటే గుడ్లగూబలా... సిగ్గేయడం లేదే నీకు? ఏ ఊరే నీది?"

"మంగళగిరి"

"మీ ఊళ్ళో మిండగాళ్ళు దొరక లేదా?"

ఆమె బిత్తరపోయింది.

"ఐతే! ఎందుకొచ్చావే ఈ ఊరికి?" హెడ్ హుంకరించాడు.

"మా అయ్యను సూడ్డానికి."

డబ్బాలో గులకరాళ్ళు కదలించినట్లుంది హెడ్ నవ్వు. "ఒసి నీ... ఎంతమందే నీకు అబ్బలు?"

'బలే అడిగారు' అన్నట్టుగా చూశాడు రాసుకుంటున్న కానిస్టేబుల్.

"చెప్పవే. ఎందుకు నిల్చున్నావే ఆ సోడా కొట్టు ముందు? నీ అబ్బ అక్కడ గాడిదలు కాస్తున్నాడా— అదీ ఆ సమయంలో? ఊఁ?"

ఆమె తలవంచుకుంది. "డబ్బు పోయిందయ్యా"

"డబ్బు పోయిందా? అయ్యో! పాపం... ఎవరి డబ్బే?"

"నాదే, సార్!"

"అసినీ సిగ తరగా. బొంకితే అలా గోడ కట్టినట్లుండాలే, సుప్పనాతీ!"

"నిజంగా సార్. దేవుడి మీద ఒట్టు!"

"నీ... (బూతుమాట) నీ లాంటి వాళ్ళు దేవుడి పేరుచెప్పి అపచారం చేయడం బట్టే మన దేశం ఇలా తగలడుతోంది. ఊ చెప్పమ్మా చెప్ప. ఎంతపోయింది? ఎలా పోయింది నా తల్లే?"

"సైకిల్‌లో వచ్చిన ఓ యెదవ నా చేతిలోని బాగ్ లాక్కొని తుర్రుమన్నాడు."

హెడ్డు ఆయాసంగా ముందుకు వొంగాడు. "ఏయ్ రండా? నీలాంటోళ్ళు ఎంత మందిని చూస్తుంటానే నా సర్వీసులో?"

"నిజం బాబు! మా అయ్యదగ్గర ఐదువేలు తీసుకుని. 12వ నెంబర్ బస్సు దిగి, లారీ ఏదైనా వస్తుందేమోనని చూస్తూంటే, ఆ దొంగ సచ్చినోడెవడో గద్దలా వచ్చి నా బాగ్‌ను తన్నుకుపోయాడయ్యా."

"రంకాడ నేర్చిన దానికి బొంకాడడం తెలీదటే? అసలు నువ్వు అక్కడే ఎందుకు నిలుచుండి పోయావే— కుర్ర నాయాళ్ళెవరూ దొరకలేదా?"

"డబ్బు లేకుండా ఇంటికి ఎలా వెళ్లేదయ్యా?"

"ఏ ఇంటికే?"

"మంగళగిరిలోని ఇంటికి. కట్నం బాపతు బాకీ అయిదు వేలు తీసుకురాకపోతే ఇంట్లోకి రానివ్వనన్నది అత్తయ్య."

"అదెవరు?"

"మా ఆయన అమ్మ."

హెడ్ అప్రయత్నంగా ఈలవేశాడు. 'ఓసోస్! నీకు మొగుడొకడు ఏడ్చాడుటే? మొగుడుండీ వ్యభిచారం చేస్తున్నావా నా తల్లే?"

ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఏయ్ నంగనాచీ! అప్పడే విన్నేం చేశాననే దొంగ వేషాలు వేస్తున్నావ్. నీ పప్పలేం ఉడకవ్ నా దగ్గర. డబ్బు పోతే మా దగ్గర కొచ్చి రిపోర్ట్ చెయ్యాలి. అక్కడే ఎందుకు నిల్చున్నావ్? పోనీ మీ అబ్బ దగ్గరకైనా వెళ్లి చెప్పకోవాలి కదా?"

"ఏం మొహం పెట్టుకుని వెళ్లి చెప్పకోమంటావయ్యా. అయ్య అసలే కష్టాల్లో ఉన్నాడు. అమ్మ తాలిబొట్టు ఆ పళాన అమ్మేసి నాకు ఆ డబ్బు ఇచ్చాడాయే. పోయిందని తెలిస్తే ఆయన గుండె పగలదూ?"

ఏం చేస్తుంటాడే వాడు?"

"ఎవరు సార్?"

"నిన్ను కట్టుకున్నాడన్నావే!"

"మా ఆయనా?"

"ఆ గాడిద కొడుకే."

సిగ్గు పడుతూ చీర కొంగుతో ముక్కు తుడుచుకుందామె.

"లంజెకు సిగ్గు కూడానా? చెప్పే ఏం చేస్తుంటాడు?"

"లారీ క్లీనర్"

"వాడికి తెలుసా నువ్వు లంజరికం చేస్తున్నావని?"

"అంత మాటనకయ్యా!" అన్నప్పుడు ఆమె గొంతు మళ్ళీ బొంగురుపోయింది.

"ఏయ్! ఏడ్చడానికిది లంజల కొంపనుకున్నావటే— పోలీస్‌స్టేషన్. జాగ్రత్త! నీ నోటి నుంచి నిజం ఎలా కక్కించాలో నాకు తెలుసే. ఇంతకీ, ఎంతే నీ రేటు?"

"అంటే?"

"వెధవ వేషాలెయ్యకు. ఒక రాత్రికి ఎంత పుచ్చుకుంటావో చెప్ప. యాభైయ్యా! అరవయ్యా?"

"నేనసుంటి దాన్ని కానయ్య. మీ కాళ్ళకు దండం పెడతాను."

"నువ్వెలాంటి దానివో ఇట్టే చెప్పేస్తానే!" అంటూ హెడ్డు లాఠీని ఆమె



రొమ్ముల మధ్య ఉంచాడు. శ్లేష్మంలో పడ్డ ఈగలా ఆమె గింజుకో సాగింది. లాఠీని చివాలున నొక్కాడు. విరగబడి నవ్వుతూ–

"తుస్‌సు! గాలి తీసేసిన టైరు లాగుందే. ఓసోసి భలే సర్వీసు ఉన్న దానివేనే," అంటూ మెల్లగా లాఠీ తీసేస్తూ, "బొడ్డులో ఏమైనా దాచావా? విప్పేయ్!" అన్నాడు.

ఇంతలో నోట్ చేసుకుంటున్న కానిస్టేబుల్ ఇబ్బందిగా మొహం పెట్టి, "సార్! నే వెళ్ళి రెడీ చేస్తా" అంటూ వెళ్లిపోయాడు.

"తియ్ బటన్‌లు" అంటూ ఆమె జాకెట్టు మీద చెయ్యి వేశాడు హెడ్డు. "బజారి ముండ జాకెట్టుకి ఇన్ని బొత్తాములా?... టయిమ్ వేస్టు!"

"బాబూ!" బోయవాడి చేతికి చిక్కిన గువ్వలా గిజగిజ లాడిపోయిందామె.

హెడ్డు చుర చుర చూశాడు. "ఉండు ఇలాకాదు నీ సంగతి!" తుపుక్కున ఆమె ముఖం మీద గళ్ళ ఉమ్మేసి, పక్క గదిలోకి తూలుతూ వెళ్లాడు.

ఆమె ముఖం తుడుచుకుంది. ఆమె మీద ఆమెకే అసహ్యం వేస్తోంది... అప్రయత్నంగా ఆమె దృష్టి అక్కడున్న కుర్చీ మీద పడింది. మెల్లగా పై కప్పు వంక చూసింది. చీర కొంగుని గబగబ విప్పబోయింది. ఉరి వేసుకోవాలనుకుందేమో!

హడావిడిగా కానిస్టేబుల్ అక్కడికి చేరుకున్నాడు. ఆమె నున్నటి కడుపు మీద చెయ్యి వేసి తన్మయానందం చెందుతూ, "పద" అన్నాడు ఆమె బొడ్డులోకి లాఠీ దూర్చబోతూ.

"ఎక్కడికయ్యా!" అతని చేతిని విదిలించుకోడానికి ప్రయత్నిస్తూ అందామె.

"రమ్మంటూంటే..." ఆమె చీరకొంగును పట్టుకుని బరబర లాక్కెళ్లాడు కానిస్టేబుల్.

ఆమె జీవచ్ఛవంలా అయిపోయింది.

ఆ పక్క గదిలో 15 కేండిల్ పవర్ బల్బు ఏడుస్తున్నట్లు వేలాడుతోంది. దానికింద టేబుల్ మీద బ్రాందీ బాటిల్, కొన్ని గ్లాసులు, పళ్ళెంలో పకోడి వున్నాయి.

గ్లాసులోని మద్యం అమాంతంగా గొంతుల పోసుకుని, ప్లేటులోంచి ఓ ముక్కను అందుకొని ఆబగా కొరకసాగాడు హెడ్డు.

ఆమె భయంగా ఇటు అటు చూసింది.

"వేస్తావుటే ఓ ముక్క?" తడబడే గొంతుకతో అడిగాడు హెడ్డు.

"వద్దయ్యా!" ఆమె గుండె వేగంగా కొట్టుకోవడం ఆమెకే వినిపిస్తోంది.

"నాటుసారా తాగే లండీకేకు ఈ సరుకు ఆనుతుందా!" అంటూ మరో పకోడిని అందుకున్నాడు హెడ్డు.

ఆ మసాలా వాసనకు ఆమె ఖాళీ కడుపు కరకర మంది.

**"నువ్వేలాంటి దానివో ఇట్టే చెప్పేస్తానే!" అంటూ హెడ్డు లాఠీని ఆమె రొమ్ముల మధ్య వుంచాడు ఆమె గింజుకోసాగింది.**

హెడ్ ఆయాసంగా లేచాడు. కానిస్టేబుల్ వంక చూస్తూ టేబుల్ మీది సీసాలు, గ్లాసులు తీసేసి వెళ్లిపొమ్మని సైగ చేశాడు. ఆ యువతి వంక తిరిగి, "జిడ్డు మొహం కడుక్కుంటావుటే?" అన్నాడు.

ఆమె నోట మాట రాలేదు.

"ఇదో ఈ రుమాలుతో ముఖమైనా తుడుచుకో" అంటూ పాంటు జేబులోంచి ఎంతో మలినంగా వున్న కర్చీఫ్‌ను ఆమె ముఖం మీద గిరాటేశాడు.

ఆమె పక్కకు తొలగి, ఆ కర్చీఫ్ నుంచి తప్పించుకుంది.

ప్రయాసతో బెల్టు తీసి అవతల పారేశాడతను.

"పడవే బల్లమీద." గేదె పేడ వేశాక ముడుచుకుపోయినట్లుంది అతని ముఖం.

ఆమె రెండు చేతులతో తన వక్షోజాలు కప్పకుంది. రాక్షసత్వంతో ఆ చేతులు లాగేస్తూ, "ఏయ్, పత్తివిత్తు వేషాలేస్తావుటే?" అంటూ హెడ్డు అమాంతంగా అడ్డకాలు వేసి, ఆమెను బల్లమీద పడేశాడు. ఆమె తల దిమ్మెక్కింది. కళ్ళు, బైర్లు కమ్మాయి. దగ్గరవుతున్న మద్యం కంపుకు ఆమెకు డోకు వచ్చేలా వుంది. పెనుగులాడింది. కాళ్ళు విలవిల తన్నుకుంది. ప్రయోజనం లేకపోయింది. బాధతో మూల్గిందంతే.

xx xx xx xx

మర్నాడు తాపీగా నిమ్మసోడా తాగుతూన్న హెడ్ దగ్గరికి కానిస్టేబుల్ ఆదరాబాదరాగా వచ్చాడు. జేబులోంచి ఒక కాగితం తీసి ఇస్తూ, "అది ఆస్పిటల్ నుంచి పారిపోయి వచ్చిన ఎయిడ్స్ రోగి అటండీ!" అన్నాడు.

హెడ్ చెవుల్లో పిడుగులు పడ్డట్లయింది. పాదాల కింద భూమి కంపించి పోయినట్లుంది. గజ గజ వణుకుతున్న కానిస్టేబుల్ కళ్ళల్లోకి చూస్తూ, "నువ్వేంటలా వున్నావ్?" అన్నాడు.

"మా ఆడాళ్ళు ఊళ్ళో లేకపోతే... నా బుద్ధి గడ్డితిని... మీ తర్వాత నేను కూడా దాన్ని నిన్న ఓ పట్టు పట్టానండి... ఇక నా గతి ఏంటి సార్? నాకూ ఆ పాడు జబ్బు..." కానిస్టేబుల్ ఏడ్పు ముఖం పెట్టాడు.

"ఒక పక్క నేనే గాభరాతో చస్తుంటే, మధ్యలో నీ గోడు ఏమిటి?" హెడ్డు ఖంగారుగా తన సైకిల్ దగ్గరికి పరుగుతీశాడు.

'ఎయిడ్స్'కి ఎవరూ అతీతులుకాదు ◆